ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 4 జూన్ 2024

గెలుపెవరిదో ?

నేడే ఎన్నికల ఫలితాలు వెల్లడి

- మధ్యాహ్నం 12 గంటలకల్లా స్పష్టత
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్ల గెలుపుపై సంపూర్ణ విశ్వాసంతో కూటమి
- అరకులోయపైనా ఆశలు



సీఎం రమేశ్ (బీజేపీ)



బూడి ముత్యాలనాయుడు (వైసీపీ)

(విశాఖపట్నం/అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఓటరు దేవుళ్ల తీర్పు వెలువడే రోజు వచ్చింది. ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. కౌంటింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైనా మధ్యాహ్నం 12 గంటల తరువాతే ఏ పార్టీకి విజయం దక్కుతుందనే విషయంలో స్పష్టత వస్తుంది. పోటీ చేసిన అభ్యర్థుల్లో ఏమవుతుందో అనే ఆందోళన చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనంతగా భారీగా ఖర్చు చేశామని, ఓటర్లు ఎవరి పక్షాన నిలిచారో అర్థం కావడం లేదని అంటున్నారు. కొందరిలో మాత్రం స్పష్టమైన ధీమా గోచరిస్తోంది. విజయం ఖాయం అని విశ్వాసంగా చెప్పగలుగుతున్నారు. మరికొందరు అభ్యర్థులలో గెలుపుపై విశ్వాసం లేదు. భారీ తేడాతో ఓడిపోకుండా, గట్టి పోటీ ఇచ్చామని అంతా భావిస్తే చాలు అని సర్ది చెప్పుకొంటున్నారు. కూటమి అభ్యర్థులైతే విజయం తమదే అనే ధీమాతో విజయోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు పార్లమెంటు స్థానాలకు గట్టి పోటీయే జరిగింది. విశాఖ పార్లమెంటుకు కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పోటీ చేయగా, వైసీపీ నుంచి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కాంగ్రెస్ నుంచి సత్యారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా కేఏ పాల్ పోటీ చేశారు. పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధికులు శ్రీభరత్ విజయం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. కనీసం లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీ వర్గాల్లో ఎంపీ స్థానంపై ఎటువంటి ఆశలు కనిపించడం లేదు. ఇక్కడ నుంచి కేఏ పాల్ కూడా పోటీ చేశారు.

అనకాపల్లి పార్లమెంటు ఎన్నిక రసవత్తరంగా సాగింది. అక్కడ కూటమి తరఫున మాజీ రాజ్యసభ సభ్యుడు ... మిగతా 8వ పేజీలో

నేడే ఓట్ల లెక్కింపు





ఏర్పాట్లు పూర్తి

- పార్లమెంట్‌తో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి వేర్వేరుగా 14 టేబుళ్లు
- కౌంటింగ్ విధులకు 1500 మంది సిబ్బంది
- ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం
- కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం అనకాపల్లి మండలం శంకరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభంకానున్నది. పటిష్ఠ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు గదులు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక గది, పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఆరు గదులు.. మొత్తం 13 గదుల్లో ఓట్లు లెక్కించనున్నారు. ప్రతి గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లు విశాఖపట్నంలో లెక్కించనున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించి ముందుగా పోస్టల్ ఓట్లను లెక్కిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరుగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రతి టేబుల్ వద్ద ఒక ఆర్వో, ఏఆర్వో పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుపుతారు. హోం ఓటర్లు 1,082 మంది, ఎన్నికల విధుల్లో పాల్గొన్న 12,864 మంది, అత్యవసర సర్వీసుల ఉద్యోగులు 1,468 మంది, త్రివిధ దళాలకు చెందిన సర్వీసు ఓటర్లు 1,051 మంది, ఇతర జిల్లాల నుంచి అందిన పోస్టల్ బ్యాలెట్‌లు 2,909 మంది మొత్తం 19,374 ఓట్లను 14 టేబుళ్లపై లెక్కించనున్నారు.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్: ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పటిష్ఠ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుం దన్నారు. అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను చేశామన్నారు. సీసీ కెమెరాల నిఘాలో లెక్కింపు జరుగుతుందన్నారు. లెక్కింపునకు హాజరయ్యే ఏజెంట్లు తెల్ల కాగితం, పెన్ను, పెన్సిల్ మాత్రమే తీసుకురావడానికి అనుమతి ఉందని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన అర్ధగంట తరువాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

ఓట్ల లెక్కింపునకు 15 వందల మంది సిబ్బంది

జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 12,89,371 ఓట్లలో ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో 10,81,042 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు విధుల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 15 వందల మంది ఉద్యోగులు పాల్గొంటారు. ప్రతి నియోజకవర్గానికి 200 మంది చొప్పున విధుల్లో పాల్గొంటారు. ప్రతి ... మిగతా 8వ పేజీలో

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు	ఫలితం రాక అంచనా సమయం
చోడవరం	1,84,026	2,837	14	18	5.30 గంటలు
మాడుగుల	1,62,580	2,817	14	17	3.00 గంటలు
అనకాపల్లి	1,70,582	2,984	14	18	5.30 గంటలు
ఎలమంచిలి	1,77,376	2,529	14	18	5.30 గంటలు
పాయకరావుపేట	2,06,626	2,288	14	21	7.00 గంటలు
నర్సీపట్నం	1,79,852	3,321	14	19	6.00 గంటలు

జిల్లాలో మాడుగులదే తొలి ఫలితం

- చివరిగా పాయకరావుపేట

అనకాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం ముందుగా రానున్నది. ఈ నియోజకవర్గంలో 1,85,989 మంది ఓటర్లు ఉన్నారు. 235 పోలింగ్ కేంద్రాల్లో 1,62,580 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 14 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ఉదయం 8.30కి ప్రారంభం కాగా, 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ప్రతి రౌండ్‌కు అర్ధగంట సమయం పడితే మధ్యాహ్నం 3 గంటల సమయానికి మాడుగుల నియోజకవర్గంలో విజేతలు ఎవరనేది తేలనుంది. అదే విధంగా జిల్లాలో పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం చివరిగా రానున్నది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,50,744 మంది ఉన్నారు. 292 పోలింగ్ కేంద్రాల్లో 2,06,626 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగితే చివరి ఫలితం రాత్రి 8.30 గంటలకు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



బ్యాంకు సిబ్బందికి ఓట్ల లెక్కింపు డ్యూటీ వేయడంతో ఇబ్బందులు

- వృద్ధులకు తప్పని అవస్థలు



చోడవరంలో బ్యాంకు వద్ద పింఛన్ కోసం బారులుతీరిన వృద్ధులు

చోడవరం, జూన్ 3: పింఛన్ నగదు డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వచ్చిన లబ్ధిదారులకు ఈసారి కూడా పడిగాపులు తప్పలేదు. బ్యాంకు ఉద్యోగులను కౌంటింగ్ విధులకు పంపడంతో సిబ్బంది కొరత వల్ల సోమవారం సేవలు సక్రమంగా అందలేదు. గత నెల మాదిరిగానే ఈ నెల కూడా సామాజిక పింఛన్లను ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసింది. దీంతో ఆదివారం సెలవు కావడంతో పింఛనుదారులు సోమవారం బ్యాంకులకు క్యూకట్టారు. అయితే బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఈసారి ఓట్ల లెక్కింపు డ్యూటీలకు పంపించడంతో బ్యాంకుల వద్ద పరిమితంగానే సిబ్బంది ఉన్నారు. దీని వల్ల రెగ్యులర్ పనులతో పాటు, పింఛనుదారులకు నగదు ఇవ్వవలసి రావడంతో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో బ్యాంకుల్లో వృద్ధులు గంటల తరబడి పడిగాపులు కాయవలసిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరత వల్ల సోమవారంలాగే, మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ జాప్యం అయ్యే పరిస్థితి ఉండడంతో వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది.

అందాల తీరం.. ఆదమరిస్తే ప్రమాదం

వాడపాలెం బీచ్‌కు పర్యాటకుల తాకిడి

- సెల్ఫీ మోజులో ప్రాణాలు కోల్పోతున్న వారెందరో..
- తాజాగా అక్కాచెల్లెళ్లు మృతి
- గతంలో ఎన్నో ప్రమాదాలు

అచ్యుతాపురం, జూన్ 3:

అందాలకు నెలవైన తంతడి శివారు వాడపాలెం సముద్ర తీరం ప్రమాదకరంగా తయారైంది. బీచ్‌లో సరదాగా గడపడానికి వెళ్లి ఏమరుపాటుగా ఉన్నవారిని కెరటాల రూపంలో మృత్యువు కబళిస్తోంది. ఇక్కడ తరచూ జరుగుతున్న ప్రమాదాలే దీనికి నిదర్శనం.

అచ్యుతాపురానికి 15 కిలో మీటర్ల దూరంలో తంతడి శివారు వాడపాలెం బీచ్ ఉంది. సెలవు రోజుల్లో గాజువాక, పరవాడ, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. కార్తీక మాసంలో పిక్నిక్‌ల సందడి ఎక్కువగా ఉంటుంది. బీచ్ వెడల్పుగా వుండడం వల్ల తీరంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి ఆటలు ఆడుకోవడానికి వీలుగా వుంటుంది. అలాగే సినిమా షూటింగ్‌లు కూడా జరుగుతుంటాయి.

ప్రమాదాలెన్నో..

తీరంలో పెద్ద కొండ ఉండడంతో ఇక్కడ అలల ఉధృతి అధికంగా ఉంటుంది. అంతే కాకుండా సముద్రం లోపల కూడా బండరాళ్లున్నాయి. అందువల్ల ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా ప్రాణాపాయం తప్పదు. ఇక్కడ సముద్రం లోతు ఎక్కువగా ఉంటుంది. 2013 ఏప్రిల్ 13న వాడపాలేనికి చెందిన మత్స్యకారుడు వంకా దేముడు కొండ పక్కనే వల వేసి అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. మర్నాడు ఉదయం శవమై తీరంలో తేరాడు. అలాగే మడుతూరుకి చెందిన దుంగా అప్పలకొండ, మడుతూరు యేసు అనే యువకులు 2009 నవంబరులో ఇక్కడికి పిక్నిక్‌కు వచ్చి సముద్ర స్నానాలు చేస్తూ మృతి చెందారు. అనకాపల్లి మండలం ఉమ్మలాడకు చెందిన మొల్లేటి వెంకటేశ్ అనే బీటెక్ విద్యార్థి, మొల్లేటి శ్రీనివాస్ అనే డిగ్రీ విద్యార్థి కలిసి 2012 డిశంబరు 2న ఇక్కడ స్నానాలు చేస్తూ గల్లంతయారు. వీరి ఆచూకీ ఇంత వరకు తెలియలేదు. 2015 ఏప్రిల్ 9న మునగపాక మండలం గణపర్తి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థినులు శరకం మౌనిక ... మిగతా 8వ పేజీలో



సెల్ఫీ కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



వాడపాలెం సముద్ర తీరానికి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడి అందాలను ఆస్వాదిస్తారు. అయితే సెల్ఫీల కోసం రాళ్లపైకి ఎక్కి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక్కడ ఆదివారం అక్కాచెల్లెళ్లు ఇద్దరూ ఇలాగే ప్రాణాలు కోల్పోయారు. మెరైన్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులను కూడా ఇక్కడ పహారాకు ఏర్పాటు చేశాం. ఆదివారం బీట్ పెట్రోలింగ్ కూడా ఏర్పాటు చేశాం. ఎన్ని చేసినా పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

- కేవీ సత్యనారాయణ, పరవాడ డీఎస్పీ

చెరువు కాదు సుమా.. రహదారే

గోతులమయంగా బీఎన్ రోడ్డు

- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

బుచ్చెయ్యపేట, జూన్ 3:

భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. చెరువును తలపించే గోతులు ఈ మార్గంలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురికావడంతో పాటు ఒళ్లు హూనమవుతోందని వాహనదారులు వాపోతున్నారు.

భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రహదారి అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు కావడం, 50 కిలో మీటర్ల రహదారి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ... మిగతా 8వ పేజీలో



బంగారుమెట్ట కూడలి వద్ద చెరువును తలపించేలా గొయ్యి

అనకాపల్లిలో భారీ వర్షం

56.2 ఎంఎంగా వర్షపాతం నమోదు

అనకాపల్లి టౌన్, జూన్ 3: అనకాపల్లి పట్టణంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. 56.2 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షం కారణంగా విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద, పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపునీరు భారీగా నిలిచిపోయింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన నీటిలోంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ ప్రైవేటు బస్సు ఆగిపోయింది. కొద్ది గంటల తరువాత ట్రాఫిక్ పోలీసుల సహాయంతో ఆ బస్సును బయటకు తీశారు. అలాగే పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలోని ఇన్‌గేటు, ఔట్‌గేటుతో పాటు డిపో ముందు కూడా చెరువును తలపించేలా వర్షపునీరు నిలిచిపోయి ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన ప్రైవేటు బస్సు

క్రైం... crime news

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

» స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురు కుటుంబ సభ్యులు

» విశాఖ వెళ్లి వస్తుండగా తామరం వద్ద ఘటన


బోల్తా పడిన కారు

మాకవరపాలెం, జూన్ 3: మండలంలోని తామరం గ్రామం వద్ద డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నానికి చెందిన ఓ కుటుంబం ఆదివారం కారులో విశాఖపట్నం వెళ్లింది. అక్కడ పనుల అనంతరం తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి ఇక్కడి తామరం గ్రామం వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నట్టు చెపుతున్నారు. అయితే బోల్తాపడిన సమయంలో కారుకు ఉన్న బెలూన్లు ఓపెన్ కావడంతో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదిలావుంటే, తామరం వద్ద గల డివైడర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా నియంత్రణ చర్యలను అధికారులు చేపట్టడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డివైడర్లకు రేడియేషన్ స్టిక్కర్లు అతికించడంతో పాటు ప్రమాద హెచ్చరికకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ లీకై ఇద్దరు మహిళలకు గాయాలు

నక్కపల్లి, జూన్ 3: మండలంలోని న్యాయంపూడి గ్రామంలో మాజీ సర్పంచ్ కె.రమణ ఇంటిలో సోమవారం గ్యాస్ సిలెండర్ లీకవ్వడంతో మంటలు వ్యాపించాయి. పెద్ద ఎత్తున పొగ వ్యాపించడంతో మణి, వీర్రాజమ్మ అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకైనట్టు బాధితులు చెప్పారు. గాయపడిన ఇద్దరిని నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

దారి దోపిడీ

» సుమారు రెండు తులాల పుస్తెలతాడు తెంచుకుపోయిన దుండగులు

» చీడికాడ నుంచి మంచాల వెళుతుండగా మార్గమధ్యంలో ఘటన


బాధిత మహిళను ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

చీడికాడ, జూన్ 3: రోడ్డుపై నడుచుకుంటూ మండలంలోని మంచాల గ్రామానికి వస్తున్న ఇద్దరు మహిళలపై గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి దౌర్జన్యం చేయడమే కాక, ఓ మహిళ మెడలో పుస్తెల తాడును తెంచుకుపోయారు. ఇందుకు సంబంధించి బాధిత మహిళలు రొంగలి జగ్గమ్మ, కె.దేవి తెలిపిన వివరాలివి. జగ్గమ్మ కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెం నుంచి మంచాల వెళ్లేందుకు సోమవారం చీడికాడ వరకూ ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి మంచాల గ్రామానికి ఆటో సదుపాయం లేకపోవడంతో అప్పటికే చీడికాడలో మంచాల వెళ్లేందుకు కె.దేవి అనే మహిళ సిద్ధం ఉండడంతో ఇద్దరూ నడుచుకుంటూ వస్తున్నారు. చీడికాడకు కిలోమీటరు దూరంలో రోడ్డు పక్కన ఉన్న బోరు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెనుక వైపుగా వచ్చి ఇద్దరు మహిళలను పక్కన ఉన్న మడిలోకి తోసేశారు. అనంతరం జగ్గమ్మ మెడలో ఉన్న సుమారు రెండున్న తులాల బంగారం పుస్తెల తాడును తెంచుకుని వెళ్లిపోయారు. దీంతో వారు గగ్గోలు పెట్టారు. బాధిత మహిళ తన కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వెతికినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై చీడికాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు జగ్గమ్మ తెలిపింది.

మైదా పిండి లారీ బోల్తా


మైదా పిండిని తీసుకుపోతున్న స్థానికులు

ఎలమంచిలి, జూన్ 3: స్థానిక పెదపల్లి జంక్షన్ సమీపంలో సోమవారం మైదా పిండి లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు తగలలేదు. ప్రమాదం జరిగిన తరువాత బోల్తా పడిన లారీని యధార్థ స్థితికి తీసుకువచ్చి వెళ్లిపోయారు. లారీ నుంచి మైదా పిండి బస్తాలు కింద పడిపోవడంతో వీటిని తీసుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు.

73 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



మద్యం సీసాలు చూపుతున్న పోలీసులు

రోలుగుంట, జూన్ 3: మండలంలోని బుచ్చెంపేటకు చెందిన గాలి నూకరాజు అనే వ్యక్తి వద్ద నుంచి సోమవారం 73 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడుతుండగా గుర్తించిన ఈ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

28 మద్యం బాటిళ్లతో మరొకరు...

పాయకరావుపేట, జూన్ 3: పట్టణంలో సోమవారం మద్యం బాటిళ్ల తరలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 28 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. పట్టణానికి చెందిన జి.అనిల్‌బాబు అనే వ్యక్తి గోనెసంచితో మద్యం సీసాలు తీసుకెళుతుండగా బృందావనం వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. అతని వద్ద 28 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

41 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జూన్ 3 : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తుల నుంచి 41 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. గొల్లపేట గ్రామానికి చెందిన జోగ సూర్యనారాయణ నుంచి 24 మద్యం సీసాలు, లంకెలపాలెంకు చెందిన కె. చంటి నుంచి ఆరు మద్యం సీసాలు, పెదముషిడివాడ గ్రామానికి చెందిన పొలిమేర రాము నుంచి ఎనిమిది మద్యం సీసాలు, వెన్నెలపాలెం గ్రామానికి చెందిన కడవల శంకరరావు నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరంతా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

అర్ధరాత్రి కుండపోత

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

» డివిజన్‌లో 78.96 సెంటీమీటర్ల వర్షపాతం

» నర్సీపట్నంలో అత్యధికంగా 12.4 సె.మీగా నమోదు


వర్షపు నీరు బలిఘట్టంలో రోడ్డుపై గుంతల్లో చేరడంతో బోల్తాపడిన ఆటో

నర్సీపట్నం, జూన్ 3: వాతావరణంలో మార్పుల కారణంగా నర్సీపట్నం డివిజన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. జనం గాఢ నిద్రలో ఉండగా ఆకాశం విరిగి పడిందా అన్నట్టు ఫెళఫెళమని శబ్దాలతో కుండ పోతగా వానపడింది. చాలాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నంలోని బలిఘట్టం మెయిన్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. సోమవారం ఉదయం ఈ రోడ్డులోని గోతిలో చేరిన నీరు కారణంగా ఆటో బోల్తాపడింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు నర్సీపట్నం డివిజన్‌లో 78.96 సెంటీ మీటర్ల వర్షం పాతం నమోదు కాగా అత్యధికంగా నర్సీపట్నం మండలంలో 120.4 మిల్లీ మీటర్లు (12.4సెంటీ మీటర్లు) వర్షం పడింది. నాతవరంలో 88.2, గొలుగొండ 48, రోలుగుంట 54.8. రావికమతం 32.4, మాడుగుల 12.6, చీడికాడ 44, కోటవురట్ల 96.8, మాకవరపాలెం 89.6, నక్కపల్లి 80.2, పాయకరావుపేట 48.4, ఎస్.రాయవరం 74.2 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

మాడుగుల సంతలో పైనాపిల్‌కు భలే గిరాకీ

» ఒక్కో పండు రూ.25 చొప్పున విక్రయం

» ఆనందం వ్యక్తం చేసిన గిరిజన రైతులు

» పనస, మామిడి సైతం భారీగా రాక


మాడుగుల సంతలో విక్రయానికి తెచ్చిన పైనాపిల్ ఫలాలు

మాడుగుల, జూన్ 3: పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో పండించిన ఈ పంటను ఆయా గిరిజన రైతులు సోమవారం మాడుగులలో జరిగిన వారపు సంతకు తీసుకు వచ్చారు. దేవాపురం, సలుగు, పులుసుమామిడి, కక్కి, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, చింతగరువు వంటి మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు సదరు ఫలాలను వాహనాలు, కావిడళ్లతో మోసుకుని వచ్చారు. సంత ఆరంభం నుంచి చివరి వరకు ఒక్కో పండు రూ.25 చొప్పున విక్రయాలు జరిగాయి. దీంతో సీజన్ ప్రారంభంలో మంచి ధర దక్కడంతో ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, పనస పళ్లు కూడా భారీగానే వచ్చాయి. ఒక్కో పండు సైజును బట్టి వంద నుంచి రెండు వందల యాభై రూపాయల వరకు అమ్మకాలు జరిగాయి. అదేవిధంగా గత రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో మామిడి కాయలు సైతం సంతకు చాలా మంది రైతులు మోసుకుని వచ్చారు. దీంతో సంతలో ఎటుచూసినా కోలాహలం నెలకొంది. వ్యాపారులు సైతం ఎగబడి కొనుగోలు చేశారు.

రాయిపాడులో జ్వరాల విజృంభణ

» గ్రామంలో 18 ఆదివాసీ కుటుంబాలు నివాసం

» వీరిలో 11 మందికి అనారోగ్యం

» గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుకు వినతి


జ్వరంతో మంచం పట్టిన శివ

రావికమతం, జూన్ 3: మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడులో పలువురు ఆదివాసీలు జ్వరాల బారినపడి మంచం పట్టారు. పద్దెనిమిది కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో పదేళ్ల బాలుడు గెమ్మిలి శివతో పాటు గెమ్మిలి గౌరీకి మలేరియా జ్వరం సోకింది. అలాగే, ఇదే గ్రామంలో పాంగి లక్ష్మి, సీదర దశి, సీదర చుక్కన్న, సీదర విమలమ్మ, గెమ్మిలి రాధ, చిక్కుడు సుబ్బు, సీదరి సన్నిబాబు, సీదరి బాబూరావు, గిన్నెల రాజులమ్మలతో పాటు పెదగరువు గ్రామానికి చెందిన మర్రి దుర్గా, విష్ణులు జ్వరాలతో మంచం పట్టారు. వీరంతా వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో ఏఎన్ఎం ఇచ్చిన మాత్రల వల్ల జ్వరం తగ్గడం లేదని వాపోతున్నారు. ఆర్ఎంపీలను ఆశ్రయిస్తుండడం వల్ల జేబులు గుల్లవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా కోరుతున్నారు. ఇదిలావుంటే, జ్వరపీడితులను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు సోమవారం పరామర్శించారు.

అభ్యర్థులు, ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

» అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ


అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ బందోబస్తు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధులపై సోమవారం రాత్రి లెక్కింపు కేంద్రం వద్ద ఆయన అవగాహన కల్పించారు. కలెక్టర్, ఆర్వో జారీ చేసిన గుర్తింపు కార్డులను తనిఖీ చేయడంతో పాటు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. మెటల్ డిటెక్టర్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. బ్రీత్ ఎనలైజర్ కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలాగ వ్యవహరించే వారిపై ఎటువంటి ఉదాసీనత చూపించకుండా అక్కడ నుంచి పికప్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న తప్పిదాలకు అవకాశం లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

» మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు


శానిటరీ సెక్రటరీలకు సూచనలిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం, జూన్ 3 : మునిసిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటెరీలతో సోమవారం ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ప్లాసిక్ కవర్లు, వాటర్ ప్యాకెట్లు లేకుండా చేయాలన్నారు. వాటర్ ప్యాకెట్లు తయారు చేయకుండా నివారించాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, మాసం దుకాణాల వద్ద ప్లాసిక్ వినియోగం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముందుగా వారం రోజులు గడువు ఇచ్చి, ఆ తరువాత దాడులు ముమ్మరం చేసి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

49 మద్యం బాటిళ్లతో ఐదుగురు అరెస్టు

బుచ్చెయ్యపేట, జూన్ 3 : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇదిలావుంటే, మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎక్కడా విజయోత్సవాలు జరపరాదన్నారు. నిబంధలను అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జలాశయంలో గిరిజనుడు గల్లంతు

చింతపల్లి, జూన్ 3: మండలంలోని తాజంగి జలాశయంలో ఓ గిరిజనుడు గల్లంతయ్యాడు. తాజంగి పంచాయతీ పరిధిలోని సిరగంపుట్టువీధికి చెందిన బురిడి గురుమూర్తి సోమవారం బంధువుల అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నానం చేసేందుకు జలాశయానికి వెళ్లి మునిగిపోయాడు. సహచరులు సాయంత్రం వరకు గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జలాశయం పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

భయంతోనే పోలీసుల కిరాయి ర్యాలీలు

» రోడ్లు, సెల్ టవర్లు మన్యం సంపదను దోచుకోవడానికే..

» మావోయిస్టు అల్లూరి, అనకాపల్లి డివిజన్ కార్యదర్శి అరుణ

జి.మాడుగుల, జూన్ 3: భయంతోనే పోలీసులు కిరాయి ర్యాలీలు నిర్వహిస్తున్నారని మావోయిస్టు పార్టీ అల్లూరి, అనకాపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులకు ఓ లేఖను విడుదల చేశారు. జిల్లా ఎస్పీ తుహన్ సిన్హా నేతృత్వంలో గత నెల 30న మద్దిగరువు వారపుసంతలో మావోయిస్టులారా.. మా జిల్లాకు రావొద్దంటూ ఐదు పంచాయతీలకు చెందిన ఆదివాసీలు ర్యాలీలు చేసినట్టు ప్రకటనలు చేసుకున్నారని, వాస్తవానికి అవి ప్రజలు నిర్వహించిన ర్యాలీలు కాదని పేర్కొన్నారు. అది పోలీసులు కొద్ది మంది ప్రజా వ్యతిరేకులను, ప్రజల చేతిలో శిక్ష గురైన ఇన్‌ఫార్మర్ల కుటుంబాలను ముందు పెట్టి, వారికి బ్యానర్లు ఇచ్చి మాట్లాడిపించారని విమర్శించారు. కొద్ది రోజుల ముందు చింతూరులో కూడా పై విధంగానే పాల్పడ్డారని గుర్తు చేశారు. ఇటీవలే పెదబయలు ఏరియా గిన్నెలకోటలో 13 మంది మిలిషియ సభ్యులు లొంగుబాట్లు అని, వీరంతా పోలీసులు చేపడుతున్నా అభివృద్ధిని ఆకర్షితులై లొంగిపోయినట్టుగా చెప్పుకున్నారని విమర్శించారు. ఆదివాసీలకు తామే ఉద్ధరిస్తున్నట్టు వాలీబాల్ కిట్లు, వంట పాత్రలు ఇస్తే అభివృద్ధి చేసినట్టా అని ప్రశ్నించారు. గత నాలుగు దశాబ్దాలు పైగా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జల్ జంగిల్ జమీన్లతో పాటు విముక్తి కోసం తెగించి పోరాడిన చరిత్ర మన్యం వాసులదని, అట్టి మన్యాన్ని మవోయిస్టులను మా జిల్లాను రావొద్దనడం అస్పష్టంగా ఉందని ఆమె హితవు పలికారు.

కౌంటింగ్‌కు ఏజెంటుగా కాకుండా అభ్యర్థిగా భావించి వెళ్లండి

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు అభ్యర్థిగా భావించి వెళ్లాలని కూటమి బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఒక హోటల్‌లో జరిగిన అనకాపల్లి పార్లమెంట్ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణలో ఆయన మాట్లాడుతూ.. మెజార్టీ వస్తుందని ఎక్కడా మనం తగ్గవద్దన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, సహనం, క్రమశిక్షణతో నడుచుకోవాలని తెలిపారు. తగాదాలు సృష్టించేందుకు ఎవరెన్ని కుట్రలు చేసినా చిట్ట చివరి వరకు మనమంతా సైనికుల్లా కౌంటింగ్ కేంద్రంలో ఉందామన్నారు. బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల లెక్కింపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చివరి నిమిషం వరకు ఏజెంటు బాధ్యతలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి రత్నాకర్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఈర్లె శ్రీరామమూర్తి, పీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, కార్మిక వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నేత 'పర్సా'

» సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నరసింగరావు


సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

అనకాపల్లి టౌన్, జూన్ 3: సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్వాతంత్ర సమరయోధుడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభ సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సీఐటీయూ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ జీవితాంతం బడుగు, బలహీన వర్గాలకు, కార్మిక వర్గ ప్రయోజనాలకు కృషి చేసిన నేతగా చిరస్థాయిగా నిలిచారన్నారు. నేటి కార్మికవర్గం ఆయన నుంచి స్ఫూర్తి పొందాలనిన్నారు. నేటి సమకాలిన రాజకీయాల్లో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోటులను తట్టుకుని నిలబడిన పర్సా జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కార్మికవర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, వీఒఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. రూపాదేవి, గనిశెట్టి సత్యనారాయణ, ఎల్. శాంతి, భీశెట్టి అప్పారావు, ఎం.నాగేషు తదితరులు పాల్గొని పర్సా చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు వెంకటేశ్ ఎంపిక


వెంకటేశ్

నక్కపల్లి, జూన్ 3: స్థానిక బీఎస్ హాకీ క్లబ్ క్రీడాకారుడు వెంకటేశ్ బెంగళూరులోని ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు ఎంపికైనట్టు హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు సోమవారం చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 8 వరకూ బెంగళూరులోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన హాకీ సెలక్షన్స్‌లో వెంకటేశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ఆయన చెప్పారు. ఈనెల 4న వెంకటేశ్ బెంగళూరు ఆర్మీ బాయ్స్ హాస్టల్‌లో చేరతాడని చెప్పారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న వెంకటేశ్, అక్కడ టెన్త్ చదువుతాడని, అన్ని వసతులు వారే చూసుకుంటారని చెప్పారు. వెంకటేశ్ ఎంపిక పట్ల హాకీ క్లబ్ నిర్వాహకులు చిన్న అప్పారావు, రాంబాబు, కొల్నాటి తాతాజీ, గాజుల రామచంద్రరావు, రజిత్, నానాజీ, రమణ, శ్రీను అభినందనలు తెలిపారు.

5న బెనారస్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూన్ 3: చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం (5న) విశాఖ నుంచి బెనారస్ వెళ్లే 18311 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటల 45 నిమిషాలపాటు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. దీంతో విశాఖలో ఉదయం 4.20 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 7.05 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

గ్యాస్ వ్యాన్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు


గ్యాస్ సిలిండర్లతో బోల్తాపడ్డ వ్యాన్

కొయ్యూరు, జూన్ 3: పెదవలస-బూదరాళ్ల ప్రధాన రహదారిలోని బొంతువలసలో సోమవారం వ్యాన్ బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. చింతపల్లి నుంచి కొయ్యూరుకు సోమవారం గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో బయలుదేరింది. పెదవలస నుంచి బొంతువలస, బూదరాళ్ల మీదుగా కొయ్యూరు వస్తూ బొంతవలస ఘాట్ రోడ్డు వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో బోల్తా కొట్టింది. దీంతో వ్యాన్‌లో సుమారు 500 పైబడి గ్యాస్ నింపిన సిలిండర్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. అదృష్టవశాత్తూ వ్యాన్ డ్రైవర్ రాజుతో పాటు క్లీనర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నీళ్లూ లేవు.. కరెంట్ లేదు..

- పట్టణ వాసుల అవస్థలు
- పెదపల్లిలో షెడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



షెడ్డుపై పడిన ట్రాన్స్‌ఫారం ఉన్న విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, జూన్ 3: రాత్రంతా విద్యుత్ లేదు.. ఉదయం కొళాయిల నుంచి నీరు రాలేదంటూ పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలమంచిలిలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెదపల్లి సమీపంలో వ్యవసాయ రైతు పడుకునే షెడ్డుపై రాత్రి ఈదురు గాలులకు ట్రాన్స్‌ఫారం ఉన్న విద్యుత్ స్తంభం పడింది. ఇదే షెడ్డులో రైతు రోజూ పడుకునే వాడని ఆదివారం రాత్రి పడుకోకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. నర్సింగబల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఎలమంచిలి వచ్చే 33 కేవీ లైన్‌పై పలుచోట్ల చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్టు ఈపీడీసీఎల్ అధికారులు అంటున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఈ ప్రభావం తాగునీటి పథకాలపై పడింది. దీంతో పట్టణంలో తాగునీటి కొళాయిలు రాకపోవడంతో నీటి కోసం ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కొత్తపేట, మిలట్రీ కాలనీ వాసులు చెబుతున్నారు.

గ్రామాల్లో పోలీసుల బందోబస్తు : సీఐ

పాయకరావుపేట, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీసులు, వివిధ బెటాలియన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈనెల 6వ తేదీ వరకు 200 మంది పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా దాడులు, కవ్వింపు చర్యలకు పాల్పడినా తక్షణం బాధ్యులను అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేశ్ పోటీ చేయగా, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోటీ చేశారు. ఇరువర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సర్వేలన్నీ సీఎం రమేశ్ గెలుస్తారని, మంత్రి బూడికి పరాజయం తప్పదని వెల్లడించాయి. ఓటర్లు ఎవరిని కోరుకున్నారో మంగళవారం సాయంత్రం తేలిపోతుంది.

దేశంలో అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గాల్లో రెండోదైన అరకు నుంచి కూటమి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కోడలు చెట్టి తనూజ, కాంగ్రెస్/వామపక్షాల అభ్యర్థిగా పి.అప్పలనర్స పోటీ చేశారు. ఇది ఐదు జిల్లాలలో కూడిన పార్లమెంటు నియోజకవర్గం కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో చెప్పలేని పరిస్థితి. వైసీపీ తమకే అవకాశం ఉందని భావిస్తోంది. ఇప్పటికే ఒకసారి ఎంపీగా గెలిచి ఉండడం, అభివృద్ధి పనులు చేసిన పేరు ఉండడంతో రెండోసారి ఎంపీగా గెలుస్తానని కొత్తపల్లి గీత ధీమా వ్యక్తంచేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా అసెంబ్లీ స్థానాల్లో..

అనకాపల్లిలో జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి ఎం.భరత్‌కుమార్ పోటీ చేయగా, పోరు హోరాహోరీగా సాగింది. అయితే ఎగ్జిట్ పోల్స్ కొణతాల రామకృష్ణకే అనుకూలమని వెల్లడించాయి. చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ నుంచి కరణం ధర్మశ్రీ మధ్య పోరు రసవత్తరంగా సాగింది. గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. మాడుగుల టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి, వైసీపీ నుంచి ఈర్లె అనురాధ పోటీ పడగా, విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎలమంచిలి జనసేన అభ్యర్థిగా ఎస్. విజయ్‌కుమార్, వైసీపీ నుంచి కన్నబాబురాజు పోటీ పడగా, ఇక్కడ కూడా ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిగా వంగలపూడి అనిత, వైసీపీ నుంచి కంబాల జోగులు పోటీ చేయగా, ఎగ్జిట్ పోల్స్‌లో టీడీపీకే అనుకూలమని తేలింది. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ నుంచి పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీ పడగా, ఇక్కడ ఫలితాలపై కూడా ఉత్కంఠ నెలకొంది.

అల్లూరి జిల్లాలో..

పాడేరు టీడీపీ అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి, వైసీపీ నుంచి విశ్వేశ్వరరాజు పోటీ చేయగా, ఇక్కడ కూడా పోరు హోరాహోరీగా సాగింది. అరకు బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావు, వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మధ్య రసవత్తర పోరు సాగింది. వీరిలో ఎవరికి వారే తమదే గెలుపని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ జిల్లాలో..

విశాఖ జిల్లాలో గాజువాక, భీమిలి, తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజక వర్గాల్లో బలమైన అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేయగా, వైసీపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పోటీగా నిలిపింది. ఈ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మిత్రులు పోటీ పడ్డారు. ఇద్దరూ మాజీ మంత్రులే. తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పోటీ చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది వేచి చూడాలి. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరఫున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీ చేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మంచి మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, వైసీపీ తరఫున కేకే రాజు పోటీ చేశారు. ఈసారి టీడీపీ, జనసేనలు కూడా అండగా నిలవడంతో విజయం ఖాయమని విష్ణుకుమార్‌రాజు విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు తన గెలుపు ఖాయమని కేకే రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పశ్చిమంలో టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనందకుమార్ పోటీ చేశారు. ఇరు వర్గాలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి. పెందుర్తిలో జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ నుంచి అదీప్‌రాజ్ పోటీ చేశారు. గట్టి పోటీ ఉండడంతో ఇరువర్గాలు విజయం తమదంటే తమదేనని ధీమాగా ఉన్నారు.

చెరువు కాదు సుమా.. రహదారే

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించిన విష యం తెలిసిందే. అయితే ప్రభుత్వం బిల్లులను సక్రమంగా మంజూరు చేయక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో మూడేళ్లుగా ఈ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఈ రహదారి పనులు పూర్తి చేయిస్తామని ఎన్నికల ముందు హడావిడి చేసిన వైసీపీ నాయకులు ఆ తరువాత మిన్నకుండి పోయారు. కాగా విజయరామరాజుపేట, వడ్డాది, బంగారుమెట్ట కూడలి, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, బూదిరెడ్ల పాలెం, కోమళ్లపూడి వద్ద గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో పడ్డ గోతులు చెరువును తలపిస్తున్నాయి. వర్షాలకు నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

అనకాపల్లిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- పార్టీ కార్యాలయాలు, నేతల ఇళ్ల వద్ద బందోబస్తు
- ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు
- పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



బీజేపీ కార్యాలయం వద్ద పోలీస్ పహారా

అనకాపల్లి టౌన్, జూన్ 3: పట్టణంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా శాంతిభద్రతలకు విఘాతం చోటు చేసుకోకుండా ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు పికెట్లు ఏర్పాటు చేసి పహారా కాస్తున్నారు. ఎన్నికల పోలింగ్ తర్వాత రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా పోటీలో ఉన్న అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద కూడా పోలీసులు పహారా కాస్తున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఏదైనా తేడా వస్తే అల్లరి మూకలు పత్రికల ప్రాంతీయ కార్యాలయాలపై దాడులు జరగకుండా నియంత్రించేందుకు పోలీసులు పట్టణంలోని పత్రికా ప్రాంతీయ కార్యాలయాల వివరాలను కూడా సేకరించారు. రింగురోడ్డు, నెహ్రూచౌక్, విజయరామరాజుపేట, పరమేశ్వరిపార్కు జంక్షన్, జాతీయ రహదారిలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం నుంచి పోలీసులు నిఘా పెట్టడమే కాకుండా మరో పక్క పహారా కాస్తున్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌడీషీటర్లను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరి నుంచి ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేసి వారి కదలికలపై నిఘా ఉంచడమే కాకుండా ఓట్ల లెక్కింపు రోజున రౌడీషీటర్ల అందరినీ పోలీస్ స్టేషన్‌లోనే ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని పట్టణ పోలీస్ అధికారులు తెలిపారు. అలాగే రింగురోడ్డులో ఉన్న జనసేన, టీడీపీ, వైసీపీ కార్యాలయాల పరిధిలో పోలీసులు నిరంతరం గస్తీ చేపడుతున్నారు.

నేడు తెర పడనున్న ఉత్కంఠ

- 20 రోజుల నుంచి కంటిపై కునుకు కరవు
- ఆందోళనలో అభ్యర్థులు

నక్కపల్లి, జూన్ 3: ఐదేళ్ల పాటు అధికారమెవరిది..? అంధకారమెవరిది..? అనే విషయం మంగళవారం తేలనుంది. నియోజకవర్గానికి తిరుగులేని రాజెవరనేది ఇప్పటికే ఓటర్లు నిర్ణయించేశారు. ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమైవుంది. ఓటేసిన వారంతా మా బాధ్యత పూర్తయిందంటూ ఊపిరిపీల్చుకున్నారు. కానీ బరిలో వున్న అభ్యర్థులకు మాత్రం నిద్ర పట్టడం లేదు. మే 13న పోలింగ్ జరిగింది. కౌంటింగ్ కోసం 20 రోజుల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. మరికొద్ది గంటల్లో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభంకానుంది. సోమవారం నుంచి ఎన్నికల బరిలో వున్న అభ్యర్థుల్లో టెన్షన్ మరింత ఎక్కువైంది. జూన్ 4 తేదీ ఎప్పుడొస్తుందాని కళ్ల కాయలు కాచేలా ఎదరుచూశారు. ఎప్పుడు తెల్లవారుతుందా ? అనే ఆతృత అభ్యర్థుల్లో వుంది. ఓటర్లు లిఖించిన తమ రాజకీయ భవిష్య నుదిటి రేఖ ఎలా వుంటుందో అనే ఉత్కంఠ అభ్యర్థుల్లో కనబడుతోంది. వారి ఆందోళనకు తగ్గట్టు పలు ఎగ్జిట్ పోల్స్ నివేదికలు మరింత టెన్షన్‌కు గురి చేశాయనే చెప్పాలి. ఏపీలో సైకిల్ జోరు వుంటుందా ? ఫ్యాన్ గాలి వుంటుందో మరికాస్సేపట్లో తెలిసిపోనుంది.

అదృష్టం ఎవరిదో..

రాంబిల్లి, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కిపు నేపథ్యంలో ఫలితాల కోసం మండల ప్రజానీకం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. మండలంలోని 51 పోలింగ్ బూతుల పరిధిలో 42,134 మంది ఓటర్లు ఉండగా.. 36,506 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 17.376 మంది కాగా, మహిళలు 18,079 మంది ఉన్నారు. 86.64 శాతం నమోదైంది. విజయంపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, వైసీపీ నాయకులు ఎవరి ధీమాలో వారున్నారు. తమ నేత విజయం సాధిస్తారంటూ బెట్టింగులు కూడా జరిగాయన్న ప్రచారం మండల వ్యాప్తంగా జరిగింది. ఈనెల 4న జిల్లా కేంద్రంలో జరిగే ఓట్లు లెక్కింపులో అదృష్టం ఎవరిని వర్తిస్తుందో వేచిచూడాలి. కాగా గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాంబిల్లి సీఐ లక్ష్మణరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఓట్ల లెక్కింపు బంగారమ్మపాలెంతో ప్రారంభం

సబ్బవరం, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుతో ప్రజల్లో 20 రోజులుగా నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు తెర పడనుంది. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి సబ్బవరం మండలం బంగారమ్మపాలెం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై వెదుళ్లనరవ గ్రామం ఓట్ల లెక్కింపుతో ముగుస్తుంది. మొత్తం ఐదు రౌండ్లులో ఓట్ల లెక్కింపు ముగిస్తుంది. సబ్బవరంలో 68 పోలింగ్ బూతులు ఉన్నాయి. ఒక్కో రౌండ్‌కు 14 పోలింగ్ బూతుల్లోని ఓట్లను లెక్కించనున్నారు. 5వ రౌండ్‌లో మండల పరిధి వెదుళ్లనరవ 68వ పోలింగ్ బూతు(వెదుళ్లనరవ) లెక్కింపుతో పూర్తవుతుంది. సబ్బవరం మండలంలోని 68 పోలింగ్ బూతుల్లో 59,548 మొత్తం ఓట్లు కాగా 50,597 ఓట్లు (పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మినహా) అంటే 84.96 శాతం పోలయ్యాయి.

'పేట' విజేత ఎవరో..!

- నేటితో ఉత్కంఠకు తెర

పాయకరావుపేట, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గంలో 20 రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా సాయంత్రానికి 'పేట' విజేత ఎవరో తేలనుంది. గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని అంచనా వేసుకున్న వైసీపీ, ఎన్డీఏ కూటమి నాయకులు ఈ ఎన్నికల్లో తామే గెలవబోతున్నామంటూ ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా వంగలపూడి అనిత పోటీచేయగా.. వైసీపీ తరఫున విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును బరిలో దించింది. వీరితో పాటు కాంగ్రెస్, బహుజన సమాజ్ , దళిత బహుజన, జై భారత్ నేషనల్, ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీలతో పాటు మరో ఇద్దరు స్వతంత్రులు కలిపి తొమ్మిది మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా ఎన్డీఏ కూటమి, వైసీపీల మధ్యే పోటీ నెలకొంది. ఈసారి జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేయడం గమనార్హం. పైగా పలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు క్యూలైన్లలో ఓపికతో ఉండి ఓటు వేయడం విశేషం. ఇది ఏ పార్టీకి లాభ పడుతుందో మంగళవారం తేలనుంది. పాయకరావుపేట నియోజకవర్గంలో పురుషులు 1,23,363, మహిళలు 1,27,379, ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం 2,50,744 మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో పురుషులు 1,02,411, మహిళలు 1,04,214. ఇతరులు ఒకరు కలిపి 2,06,626 (82.41 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కశింకోట, జూన్ 3 : మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం కలుసుకున్నారు. రోజంతా జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆనందంగా గడిపారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు అమీర్, రమేష్, చల్లరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొని తమ బ్యాచ్ తరఫున సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేయాలని తీర్మానించారు.



1993-94 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బ్యాచ్

కుండపోత

- నదులు, చెరువుల్లో చేరిన నీరు
- వేసవి తాపం నుంచి జనానికి ఉపశమనం



కోటవురట్ల: పాతరోడ్డు వద్ద ప్రవహిస్తున్న వరహా నది

కోటవురట్ల,మే 3: మండలంలో ఆదివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచి తెల్లవారు మూడు గంటల వరకు ఉరుములు, మెరుపుతో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలో గెడ్డలు, వాగులు, పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి చేరుతున్నది. వరహా, సర్పా నదుల్లో కొత్తనీరు ప్రవహించడంతో జలకళ వచ్చింది. కుండపోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కె. వెంకటాపురం, కొడవటిపూడి గ్రామాల గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో వాహనాలు రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. మండల కేంద్రంలో 97.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని రైతులు భావిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి ఉదయం పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గంటసేపు ఉరుములు, గాలులతో వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. రైతులు వ్యవసాయ పనులు చేసుకొనేందుకు సిద్ధమయ్యారు. కాగా రోడ్లపై గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురవడంతో వరహా నదిలోకి కొత్త నీరు చేరింది. మండుతున్న ఎండలకు ఉక్కపోతతో విలవిలలాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పరవాడలో.. మండల వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇటీవల కాసిన ఎండలకు పూర్తిగా ఎండిపోయిన పరవాడ బంద చెరువు, ఊర చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరింది. ప్రధాన రహదారి పైనుంచి వర్షపునీరు పారింది. ఎండల కారణంగా ఎండిపోయిన కూరగాయల పంటలకు ఈ వర్షం ఊపిరిపోసింది. పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. వాతావరణం కాస్త చల్లబడింది.

నేడే ఓట్ల లెక్కింపు

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గదిలో ఒక రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఒక ఏఆర్‌వో, గెజిటెడ్ హోదా కలిగిన ఒక కౌంటింగ్ సూపరింటెండెంట్, ఒక సహాయకుడు, ఒక మైక్రో అబ్జర్వర్, ఈవీఎంలను అందజేసేందుకు ఇద్దరు వీఆర్‌వోలను నియమించారు. వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలో ఉంటారు.

ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు

ప్రతి నియోజకవర్గానికి ఒక గది కేటాయించి, 14 టేబుళ్లను ఏర్పాటు చేసి ఓట్లను లెక్కించనున్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక ప్రతి రౌండ్‌కు కనీసం అర్ధగంట సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రౌండ్‌లో ఆయా నియోజకవర్గానికి చెందిన 14 పోలింగ్ బూత్‌ల ఓట్ల లెక్కింపు జరపనున్నారు. చోడవరం నియోజకవర్గం పరిధిలో 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తి లెక్కింపు, 18వ రౌండ్‌లో 5 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓట్లు లెక్కించనున్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 235 పోలింగ్ కేంద్రాలు ఉంటే 14 టేబుళ్లపై 17 రౌండ్లు పూర్తిస్థాయిలో 18వ రౌండ్‌లో 11 బూత్‌లకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. అనకాపల్లి పరిధిలో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తిగా లెక్కింపు జరిపి 18వ రౌండ్‌లో 13 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఎలమంచిలి పరిధిలో 246 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలలో పూర్తిస్థాయిలో లెక్కింపు, 18వ రౌండ్‌లో 8 బూత్‌లకు సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు. పాయకరావుపేట పరిధిలోని 292 పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 పూర్తిస్థాయి రౌండ్లలో లెక్కించి, 21వ రౌండ్‌లో 12 బూత్‌ల ఓట్లు లెక్కించనున్నారు. అదే విధంగా నర్సీపట్నం పరిధిలో 262 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓట్లు 14 టేబుళ్లపై 18 పూర్తిస్థాయి రౌండ్లు లెక్కించి 19వ రౌండ్‌లో 10 పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. లెక్కింపు గదిలో ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, ఒక మైక్రోఅబ్జర్వర్ ఉంటారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారులు ఉంటారు. కౌంటింగ్ సహాయకుడు వరుస సంఖ్యలో ఉన్న ఈవీఎంలను 14 టేబుళ్లపై ఉంచుతారు. ఆ తరువాత ఆయన కంట్రోల్ యూనిట్‌కు ఉన్న సీల్‌ను తొలగిస్తారు. పార్టీల లెక్కింపు ఏజెంట్ల సమక్షంలో రిజల్ట్ బటన్‌ను నొక్కుతారు. అప్పుడు కంట్రోల్ యూనిట్‌లో వరుస సంఖ్యల ఆధారంగా ఏయే అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయన్నది స్పష్టం అవుతుంది. పార్టీల వారీగా నమోదైన ఓట్లను లెక్కించిన తరువాత మైక్రో అబ్జర్వర్ ప్రత్యేకంగా రూపొందించిన పట్టికలో ఆ రౌండ్ ఫలితాలు, ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలు నమోదు చేస్తారు. 14 కంట్రోల్ యూనిట్లలో లెక్క తేలితే ఒక్క రౌండ్ పూర్తయినట్లు పరిగణిస్తారు. పరిశీలన తరువాత సంబంధిత రిటర్నింగ్ అధికారి, పరిశీలకులు ఫలితాలను ప్రకటిస్తారు. రిటర్నింగ్ అధికారి గెలుపొందిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచే అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు, అధికారులు ఓట్ల లెక్కింపు సరళిని పర్యవేక్షించవచ్చు. ఆర్‌వోలు జారీ చేసిన పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. అధికారుల కోసం, పోటీ చేసిన వివిధ పార్టీల అభ్యర్థులకు రెండు వేర్వేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. పోస్టల్ ఓట్లు, సర్వీసు ఓట్ల లెక్కింపు వద్ద ఆర్‌వో, ఏఆర్‌వోలను నియమించారు. ప్రతి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గదిలో ఆర్వో వద్ద ప్రత్యేక బృందం విధులు నిర్వహించనున్నారు. ప్రతి టేబుల్ వద్ద బరిలో నిలిచిన అభ్యర్థుల ఏజెంట్లు కూడా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

కేంద్రం వద్ద పటిష్ట భద్రతా చర్యలు

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ నేతృత్వంలో మూడంచెల భద్రతా చర్యలు చేపట్టారు. కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఆర్‌పీఎఫ్ బలగాలు, ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద రిజర్వుడు పోలీసు బలగాలను, బయట ప్రధాన రహదారుల కూడలి వద్ద సివిల్ పోలీసులతో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం పరిసరాలను నో ఫ్లైజోన్‌గా ప్రకటించారు. శంకరం గ్రామ పరిసరాల్లోని 100 మీటర్ల దూరంలో 90 మంది సాయుధ పోలీసుల పహారా నిరంతరాయంగా సాగేలా ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లిలో నాయకుల హడావిడి

అనకాపల్లిలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు అనకాపల్లి చేరుకున్నారు. పట్టణంలో హోటళ్లు, లాడ్జీలు వీరితో నిండిపోయాయి. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, టీడీపీ, జనసేన, వైసీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు పట్టణంలో బస చేశారు.

అందాల తీరం.. ఆదమరిస్తే ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పులిగ సత్యభవాని, కాండ్రేగుల శ్రావణి స్నానాలు చేస్తూ మృతి చెందారు. వీరు పదవ తరగతి ఆఖరి పరీక్ష రాసి తమ స్నేహితులు 26 మందితో ఆటోల్లో ఇక్కడికి వచ్చి మృత్యువు బారిన పడ్డారు. 2016 అక్టోబరు 26న అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయికృష్ణ ఇక్కడే సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. ఆ తరువాత అతని ఆచూకీ తెలియలేదు. 2019 జూన్ 9న తూర్పుగోదావరి జిల్లాకి చెందిన వెంకట సత్యసాయి గల్లంతయ్యాడు. 2023 జనవరి 14న అనకాపల్లి రాణిగారి పూలతోట ప్రాంతానికి లీలా ప్రశాంత్ (30), ఢిల్లీకి చెందిన లక్ష్యవర్మ (14) మృతి చెందారు. 2023 నవంబరు 26న పరవాడ బీసీ కాలనీకి చెందిన జంగాల రాజేశ్(14) గల్లంతయ్యాడు. ఈ నెల రెండున అక్కాచెల్లెళ్లయిన కనకదుర్గ, నూకరత్నంలు సెల్ఫీ తీసుకుంటూ అలల ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఎక్కువ శాతం విద్యార్థులతో పాటు యువకులు ఇక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు.

కూటమి గెలుపు కోసం ప్రత్యేక పూజలు



మునగపాకలో ప్రత్యేక పూజలు చేస్తున్న తెలుగు మహిళలు

మునగపాక (తుమ్మపాల), జూన్ 3 : కూటమి గెలవాలని ఆకాంక్షిస్తూ తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో మునగపాక శివాలయంలో మహిళలు ప్రత్యేక పూజలను సోమవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు రేబాక మాలతి, సరోజిని, ఆడారి జానకి, పెంటకోట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా 'గంపాన'

అనకాపల్లి టౌన్, జూన్ 3 : ఏపీ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణంలోని విజయరామరాజుపేటకు చెందిన అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రి నాల్గో తరగతి ఉద్యోగి గుంపాన శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో శ్రీనివాసరావును కార్యదర్శిగా నియమిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శ్రీనివాసరావును సత్కరించారు. ఇదిలా ఉండగా సంఘ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాసరావు సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయంలోని జిల్లా ఆసుపత్రుల కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో గౌతమ్ అభినందించారు.

'అనుమతుల మేరకే భవన నిర్మాణం'

అచ్యుతాపురం, జూన్ 3: అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రోడ్డులో మోసయ్యపేట పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న భవనానికి అన్ని అనుమతులు ఉన్నాయని కార్యదర్శి అమ్మాజీ తెలిపారు. 'హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల రెండున వచ్చిన వార్తకు ఆమె స్పందించారు. ఇక్కడ 223.18 చదరపు గజాల స్థలంలో నివాసయోగ్యానికి భూ యజమాని మళ్ల నవీన్ అర్జీ పెట్టుకున్నాడు. భూ సంబంధిత రికార్డులు పరిశీలించి నివాసయోగ్య భవనానికి పంచాయతీ నుంచి అనుమతులు మంజూరు చేశామన్నారు. వ్యక్తిగత కక్షల కారణంగా దీనిని రాజకీయం చేస్తున్నారన్నారు. 300 చదరపు గజాల విస్తీర్ణం వరకు భవన నిర్మాణానికి పంచాయతీ అనుమతులివ్వవచ్చని, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం అయితే వీఎంఆర్డీయే అనుమతులు కావాలన్నారు. ఇందులో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఆమె తెలిపారు. భవన నిర్మాణం నిలిపివేయాలని హైకోర్టు నుంచి ఎటువంటి ఉత్తర్వులు తమకు రాలేదని ఆమె తెలిపారు.

మత్స్యకారులందరికీ వేట నిషేధ భృతి ఇవ్వాలి

- సముద్ర శ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అచ్యుతాపురం, జూన్ 3: మత్స్య శాఖ గుర్తించి మత్స్యకారులందరికీ చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని ఇవ్వాలని సముద్ర శ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎఫ్‌డీఓ రవితేజకు సోమవారం వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూడిమడకలో 1,728 మంది మత్స్యకారులను ఈ భృతికై ఎంపిక చేశారని, అయితే ఇందులో ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న డీజిల్‌ని వినియోగించలేదంటూ 611 మంది మత్స్యకారులను ఈ భృతి నుంచి తప్పించారన్నారు. సబ్సిడీపై డీజిల్ తీసుకోవడానికి మత్స్య శాఖ అధికారులు ప్రత్యేక కార్డులు ఇవ్వకపోవడంతో వారు డీజిల్ తీసుకోలేదన్నారు. కార్డులు ఉన్నవారు కూడా అచ్యుతాపురం వెళ్లి డీజిల్ తెచ్చుకోవలసి వస్తోందని, ప్రభుత్వం కేవలం కుంటి సాకులు చూపి అందరికీ భృతి రాకుండా చేస్తోందని వారు ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం అధ్యక్షుడు కొవిరి మసేను, ఉపాధ్యక్షుడు సూరాడ మేసేను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు క్రాఫ్ట్ వర్క్

అచ్యుతాపురం, జూన్ 3: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి తగిన శిక్షణ ఇస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ప్రముఖ క్రాఫ్ట్ ట్రైనర్ కొమాండూరి జ్యోతిర్మయి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సుల్లో భాగంగా సోమవారం ఆమె క్రాఫ్ట్ గురించి పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె పేపర్లతో క్రాఫ్ట్ వర్క్ చేయించారు. గ్రంథాలయాధికారి బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల ఐదున విద్యార్థులకు వ్యాసరచన (ఓటు హక్కు ప్రాధాన్యం), డిబేట్ (స్మార్ట్ ఫోన్ పిల్లలపై ప్రభావం) క్విజ్ నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి వెంకట అప్పారావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక (తుమ్మపాల), జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం మునగపాక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30, టీఆర్‌టీసీ సెక్షన్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున కార్యకర్తలు కౌంటింగ్ ప్రదేశానికి వెళ్లరాదని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడానికి వీల్లేదన్నారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. సభలు, సమావేశాలకు అనుమతి లేదని, రోడ్లపై గుంపులుగా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ఓట్ల కౌంటింగ్‌కు అంతా సహకరించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు మినహా ఇతరులు రావడానికి అనుమతి లేదన్నారు. పార్టీల కార్యకర్తలు, నాయకులు కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లవద్దన్నారు. అలాగే ఫలితాలు తెలిసినప్పుడు ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా ఉండడం కూడా నేరం కిందే పరిగణించబడుతుందన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టింగ్‌లు పెట్టి గొడవలకు కారణమైతే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఘర్షణలకు పాల్పడితే వారిని గుర్తించి రౌడీ షీటు కూడా తెరవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీఐ బుచ్చిరాజు కూడా పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సీఐ

సబ్బవరం, జూన్ 3 : ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ పిన్నింటి రమణ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరుగుతున్నందున శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2 క్యూఆర్ టీమ్‌లు, ఒక చెక్‌పోస్టు, 2 పెట్రోలింగ్ పార్టీస్, 2 పికెట్స్ 2 మొబైల్ పార్టీలు, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అలాగే 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందన్నారు.

అలరించిన పాటల పోటీలు

పాయకరావుపేట, జూన్ 3: పట్టణంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు నిర్వహించిన పాటల పోటీలు అందరినీ అలరించాయి. అంతకుముందు విశ్రాంత ఉపాధ్యాయుడు సీతారామ్మూర్తి విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, హిందీ, తెలుగు పదాలు చదవడం, రాయడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. గత నెల 13న ఈ పోరు జరగ్గా.. ఫలితాల కోసం ఇటు అభ్యర్థులు, అటు ఓటర్లు ఇరవై రెండు రోజుల పాటు నిరీక్షించక తప్పలేదు. ఇక ఆ సమయం రానే వచ్చింది. మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు ఆరంభం కానుండడంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఎవరిని కదిపినా ఇదే ఉత్కంఠ.



ఓట్ల లెక్కింపునకు వేళాయె

» నేడు జిల్లా కేంద్రం అనకాపల్లిలో నిర్వహణ » ఫలితాలపై అంతటా ఉత్కంఠ



చింతకాయల అయ్యన్నపాత్రుడు | పెట్ల ఉమా శంకర్ గణేశ్ | రుత్తల శ్రీరామమూర్తి



నర్సీపట్నంలో కౌటింగ్ ఏజెంట్లతో అయ్యన్నపాత్రుడు



అనకాపల్లి కౌటింగ్‌కు బయలుదేరిన ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఉత్కంఠకు మంగళవారంతో తెర పడనుంది. గత నెల 13 తేదీన ఈ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. నర్సీపట్నం నియోజకవర్గంలో 2,12,046 ఓటర్లకు గాను 1,79,852 మంది (84.82 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 87,334 మందికాగా, మహిళలు 92,515, ఇతరులు ముగ్గురు ఓటు వేశారు. పోలింగ్ పూర్తయిన దగ్గర నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజల్లో టెన్షన్ నెలకొంది. ఫలితాలు ఎప్పుడు వస్తాయా.. అని గత ఇరవై రెండు రోజులుగా ఎదురు చూపులు చూస్తున్నారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు దాదాపు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలలోపు బహిర్గతం కానుంది. ఈ నియోజవర్గంలోని టీడీపీ, వైసీపీ వర్గాలు ఎన్నికల ఫలితాలపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి.

అనకాపల్లిలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు మొదలు కానుంది. తర్వాత 8.30 గంటలకు కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల ఎక్కింపు చేపడతారు. గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో 262 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం అదనంగా మరో రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు. రౌండ్‌కి 14 ఈవీఎం (కంట్రోల్ యూనిట్లు)లు చొప్పున 18 రౌండ్‌లలో 252 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు లెక్కింపు పూర్తి చేసి, 19వ రౌండ్‌లో మిగిలిన 10 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు ఓట్లు లెక్కిస్తారు. తొలుత గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేట ఒకటో పోలింగ్ కేంద్రంలోని ఓట్లు లెక్కిస్తారు. మొదటి నాలుగు రౌండ్లలో గొలుగొండ మండలంలో ఏ పార్టీకి మెజార్టీ వచ్చిందో ఫలితం తేలిపోతుంది. తర్వాత నాతవరం, నర్సీపట్నం గ్రామీణం, మునిసిపాలిటీ, మాకవరపాలెం మండలంలోని ఓట్లు లెక్కిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలలోపు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని చెపుతున్నారు.

నర్సీపట్నం నియోజవర్గంలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులతో సహా ఎనిమిది మంది పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ (ఐ) పార్టీ అభ్యర్థిగా రుత్తల శ్రీరామమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు, జై భీం రావు భారత్ పార్టీ అభ్యర్థిగా నేతల నాగేశ్వరరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి జోగా చంద్రమౌళి, స్వతంత్ర అభ్యర్థులుగా బయపురెడ్డి భద్రాచలం, ఫైలా సూర్యగణేశ్ పోటీ చేశారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యనే ప్రధానంగా పోటీ ఉంది. ఎవరిని విజయలక్ష్మి వరిస్తుందో మరి కొన్ని గంటలు వెచి ఉండక తప్పదు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సులు అనకాపల్లి తరలింపు

నర్సీపట్నం, జూన్ 3 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం బయటకు తీశారు. అనంతరం పీటీడీ గూడ్స్ ట్రాన్స్ పోర్ట్ వాహనంలోకి ఎక్కించి సీల్ వేసి, ప్రత్యేక పోలీసు బందోబస్తు సహాయంతో అనకాపల్లి కౌటింగ్ కేంద్రానికి తరలించారు. నియోజకవర్గంలో 3,196 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, 129 సర్వీసు ఓట్లు పోలయ్యాయి. మంగళవారం కౌటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తగా నర్సీపట్నం అబీద్ సెంటర్, పెదబొడ్డేపల్లి కూడలి, బలిఘట్టం జంక్షన్‌లలో పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఇళ్ల వద్ద ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ స్టేషన్ సిబ్బంది కాకుండా, స్పెషల్ పార్టీ పోలీసులు ఇరవై మంది బందోబస్తులో ఉంటారని సీఐ కాంతికుమార్ తెలిపారు.

వ్యక్తిగత భద్రతను తిరస్కరించిన అయ్యన్న

నర్సీపట్నం : పోలీసులు కల్పిస్తామన్న వ్యక్తిగత భద్రతను మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు తిరస్కరించారు. సోమవారం ఆయ నను తన నివాసంలో డీఎస్పీ మోహన్, ఇద్దరు సీఐలు కలిశారు. వ్యక్తిగత భద్రత కల్పించమని డీజీపీ ఆదేశాలు ఉన్నాయని తెలియజేశారు. దీనిపై అయ్యన్న తనకు పోలీ సులు ఎటువంటి సెక్యూరిటీ కల్పించనవసరం లేదని సున్నితంగా తిరస్కరించారు. గత ఐదేళ్లు తనపై అకార ణంగా అనేక కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారన్నారు. ఇప్పుడు సెక్యూరిటీ కల్పిస్తామంటే అవసరం లేదని తెలిపారు. ఇదిలావుంటే, కౌటింగ్ సమయంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఏజెంట్లకు అయ్యన్న ఇక్కడ దిశానిర్దేశం చేశారు. నియోజవర్గం నాయకులు, ఏజెంట్లు పాల్గొన్నారు. అలాగ, సోమవారం ఉదయం పోలింగ్ ఏజెంట్లతో పాటు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అనకాపల్లి చేరుకున్నారు. ఆదివారం ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి కౌటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

చోడవరం.. ఎవరిపరం



కేఎస్ఎన్ఎస్ రాజు | కరణం ధర్మశ్రీ | జగతా శ్రీనివాసరావు

చోడవరం : ఎన్నికల పోరాటంలో నియోజకవర్గంలో విజేత ఎవరనే ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఇద్దరూ నాలుగోసారి తలపడగా, కాంగ్రెస్ అభ్యర్థిగా పాయకరావుపేటకు చెందిన జగతా శ్రీనివాసరావు, బీఎస్పీ అభ్యర్థిగా వేగి మహాలక్ష్మినాయుడు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేశ్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పేరిచర్ల వివేకరాజు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో రాజు, ధర్మశ్రీలు ఇద్దరూ హోరాహోరీగా తలపడడంతో ఈసారి విజయంపై ఇరువర్గాల్లో ఉత్కంఠ నెలకొనగా, అభ్యర్థులు మాత్రం ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈసారి చోడవరంలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి కేఎస్ఎన్ఎస్ రాజు తన సత్తా చాటుతారా, లేదా సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ మరోసారి తన పదవి కాపాడుకుంటారా అనేది వేచి చూడాల్సి ఉంది.

మాడుగులలో ఎవరిధీమా వారిదే



బండారు సత్యనారాయణమూర్తి | ఈర్లె అనురాధ | బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు

మాడుగుల, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుండడంతో అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల శ్రేణులు, అన్నివర్గాల ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఇక్కడ పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. మాడుగుల నియోజకవర్గంలో మొత్తం 1,88,989 మంది ఓటర్లు ఉండగా, 1,62,580 ఓట్లు పోలయ్యాయి. కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి, వైసీపీ నుంచి ఈర్లె అనురాధ తలపడ్డారు. అలాగే, కాంగ్రెస్ నుంచి బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తొలి భార్య కుమారుడు బూడి రవికుమార్, మల్లారపు లోవ, మతల ఆరినాయుడు స్వతంత్ర అభ్యర్థులుగా, బీఎస్పీ, ఇతర పార్టీల నుంచి కరణం తిరుపతిరావు తాళ్ల రవి, లెక్కల ఈశ్వరరావు బరిలో ఉన్నారు. అయితే గెలుపుపై ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్‌లో ఉత్తమ విద్యార్థులకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థులతో సంఘ సభ్యులు

చోడవరం, జూన్ 3 : పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన ప్రతిభావంతులైన విద్యార్థులను తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడ ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌మెన్ సభ్యుడు దొరబాబు, శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు తదితరులు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మరింత క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం సభ్యులు, కాపురాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

120 మందికి కంటి పరీక్షలు

దేవరాపల్లి, జూన్ 3 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం విశాఖపట్నం శంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు జరిపినట్టు క్యాంపు కో-ఆర్డినేటర్ సిహెచ్. అశ్వనీ కుమార్ తెలిపారు. ఇందులో 40 మందికి ఆపరేషన్ ఎంపిక చేసి విశాఖపట్నం తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పూజిత మేఘన, వనజ, ఆప్తాలమిక్ అధికారిణి భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఖోఖో పోటీలు

చీడికాడ, జూన్ 3 : విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని చీడికాడ గ్రంథాలయాధికారి ఎంఎల్ఎస్ జోగేశ్వరి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం గ్రంథాలయంలో విద్యార్థులకు ఖోఖో పోటీలను నిర్వహించారు. అలాగే వివిధ కథలు చెప్పి వాటి అర్థాలను వివరించారు.

పెన్షనర్లకు తప్పని పాట్లు

బుచ్చెయ్యపేట/గొలుగొండ/దేవరాపల్లి, జూన్ 3 : ప్రభుత్వ సామాజిక పెన్షన్ల కోసం లబ్ధిదారులకు అవస్థలు తప్పలేదు. జూన్ నెలలోనూ వృద్ధులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో డబ్బులు తీసుకునేందుకు చాలాచోట్ల ఇబ్బంది పడ్డారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది ఐఓబీ వద్ద పెన్షన్ నగదు కోసం సోమవారం గంటల తరపడి వేచి ఉండడం కనిపించింది. ఎనభై ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు, అనారోగ్యంతో బాధపడుతూ మంచంపై అవస్థలు పడుతున్నవారికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. అలాగే, గొలుగొండ మండలంలోనూ పెన్షనర్లు ఇవే అవస్థలు ఎదుర్కొన్నారు. ఇక్కడ ఇరవై గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 9500 మంది వివిధ రకాలైన పెన్షనర్లు ఉండగా, సుమారు ఎనిమిదివేల మందికి ఆయా బ్యాంకు ఖాతాల్లో అధికారులు నగదును జమ చేశారు. దీంతో ఆ నగదు తీసేందుకు వారు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. అదేవిధంగా, దేవరాపల్లి మండలంలోనూ పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ మొత్తం పదివేల ఐదు వందల మంది పెన్షనర్లు ఉన్నారు. వీరిలో ఎనిమిది వేల మందికి బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేశారు. మిగిలిన వారికి ఇళ్ల వద్ద ఇచ్చారు. బ్యాంకు ఖాతాల్లో నగదు జమైన వారిలో చాలామంది నడవలేని, కళ్లు కనిపించని వారు ఉన్నారు. అటువంటి వారు మండల కేంద్రం దేవరాపల్లికి ఆటోలు కట్టించుకుని రావడంతో పాటు ఇతర ఖర్చులు అదనంగా అయ్యాయి. దీంతో వారు ప్రతినెలా తమకు ఇంటి వద్దే పెన్షన్ అందించాలని కోరుతున్నారు.

చెరువు కాదు సుమా.. రహదారే



ఎల్.సింగవరం వద్ద రహదారి దుస్థితి ఇలా..

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించిన విష యం తెలి సిందే. అయితే ప్రభుత్వం బిల్లు లను సక్రమంగా మంజూరు చేయక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో మూడేళ్లుగా ఈ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఈ రహదారి పనులు పూర్తి చేయిస్తా మని ఎన్నికల ముందు హడావిడి చేసిన వైసీపీ నాయకులు ఆ తరువాత మిన్నకుండి పోయారు. కాగా విజయరామరాజుపేట, వడ్డాది, బంగారుమెట్ట కూడలి, ఎల్.సింగవరం, పొట్టిదొర పాలెం, బూదిరెడ్ల పాలెం, కోమళ్లపూడి వద్ద గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో పడ్డ గోతులు చెరువును తలపిస్తున్నాయి. వర్షాలకు నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పావుగంటలో చోడవరం మండల సమావేశం ముగింపు



సమావేశానికి అరకొరగా హాజరైన సభ్యులు.., మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ చైతన్య

చోడవరం, జూన్ 3 : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. తొలుత సభ్యుల కోరం సరిపడకపోవడంతో ఆలస్యంగా పన్నెండు గంటలకు ప్రారంభమై, పావు గంటలోనే ముగిసిపోయింది. ఎన్నికల ఫలితాలకు ముందు నిర్వహిస్తున్న సమావేశం కావడంతో పెద్దగా సభ్యులెవరూ హాజరు కాలేదు. సమావేశానికి అవసరమైన సభ్యులు హాజరుకాకపోవడంతో అధికారులు చాలాసేపు వేచి చూశారు. చివరకు మధ్యాహ్నం 12 గంటల సమయానికి సరిపడా సభ్యులు రావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన ఈవోపీఆర్‌డీ బి.చైతన్య ఎన్నికల కోడ్ కారణంగా సభ్యులు చెప్పిన సమస్యలు వినడం తప్పతే, తామెలాంటి హామీ ఇవ్వలేమని స్పష్టం చేశారు. దీంతో ఒకరిద్దరు సర్పంచ్‌లు సమస్యలు లేవనెత్తడానికి ప్రయత్నించినా, అధికారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో వారు సైతం మిన్నకుండిపోయారు. వ్యవసాయశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పశు సంవర్ధకశాఖ, విద్యుత్ శాఖ అధికారులు మొక్కుబడిగా మాట్లాడి కూర్చుండిపోయారు. ఈ పరిణామం చూసిన సభ్యులు ఇలాంటప్పుడు సమావేశం కొనసాగించడం ఎందుకని ముగించేయాలని చెప్పడంతో అధికారులు సమావేశాన్ని ముగించేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



రోలుగుంట మండలం కొవ్వూరులో పిడుగు పడి మృతి చెందిన గేదే

గొలుగొండ/కృష్ణాదేవిపేట, జూన్ 3 : వాతావరణంలో మార్పుల కారణంగా ఆదివారం అర్ధరాత్రి పలు మండలాల్లో భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో గొలుగొండల మండలంలోని గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, చీడిగుమ్మల, పాకలపాడు, రావణాపల్లి, గుండుపాల, కొత్తఎల్లవరం, పప్పుశెట్టిపాలెం, ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. ఈ కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం మధ్యాహ్నం వరకు సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా మోటార్లు పనిచేయక నీటి కష్టాలు ఎదుర్కొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. భీకర శబ్దాలతో ఉరుములు, మెరుపులు గాలులతో సుమారు ఎండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా పడిన వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో మరీ దారుణంగా ఉంది. గత వారం రోజులు ఎండల ధాటికి అల్లాడిన జనం తాజా వర్షానికి ఒక్కసారిగా చల్లబడడంతో అంతా ఉపశమనం పొందారు. సోమవారం ఉదయం నుంచి మబ్బు వాతావరణం నెలకొనడంతో ఉక్కపోత ఆగలేదు. ఈ వర్షం వేసవి దుక్కులకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని చెపుతున్నారు.

రోలుగుంట, జూన్ 3 : మండలంలో సోమవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, వాగుల్లో నీరు చేరింది. ఇదే సమయంలో కొవ్వూరులో పిడుగుపడి గ్రామానికి చెందిన మాసాద శంకరరావుకు చెందిన పాడి గేదె మృతిచెందింది. దీంతో సదరు రైతులు గగ్గోలు పెడుతున్నాడు. గేదె మృతితో రూ.లక్ష వరకు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చీడికాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి పది నుంచి పదకొండు గంటల వరకూ గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం వరకూ విద్యుత్ సరఫరా లేదు.

కె.కోటపాడు : మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున మూడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో భారీగా పడడంతో అంతటా చల్లబడింది. అయితే గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అందాల తీరం.. ఆదమరిస్తే ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పులిగ సత్యభవాని, కాండ్రేగుల శ్రావణి స్నానాలు చేస్తూ మృతి చెందారు. వీరు పదవ తరగతి ఆఖరి పరీక్ష రాసి తమ స్నేహితులు 26 మందితో ఆటోల్లో ఇక్కడికి వచ్చి మృత్యువు బారిన పడ్డారు. 2016 అక్టోబరు 26న అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయికృష్ణ ఇక్కడే సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. ఆ తరువాత అతని ఆచూకీ తెలియలేదు. 2019 జూన్ 9న తూర్పుగోదావరి జిల్లాకి చెందిన వెంకట సత్యసాయి గల్లంతయ్యాడు. 2023 జనవరి 14న అనకాపల్లి రాణిగారి పూలతోట ప్రాంతానికి లీలాప్రశాంత్ (30), ఢిల్లీకి చెందిన లక్ష్యవర్మ (14) మృతి చెందారు. 2023 నవంబరు 26న పరవాడ బీసీ కాలనీకి చెందిన జంగాల రాజేశ్(14) గల్లంతయ్యాడు. ఈ నెల రెండున అక్కాచెల్లెళ్లయిన కనకదుర్గ, నూకరత్నంలు సెల్ఫీ తీసుకుంటూ అలల ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఎక్కువ శాతం విద్యార్థులతో పాటు యువకులు ఇక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు.

గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేశ్ పోటీ చేయగా, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోటీ చేశారు. ఇరువర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సర్వేలన్నీ సీఎం రమేశ్ గెలుస్తారని, మంత్రి బూడికి పరాజయం తప్పదని వెల్లడించాయి. ఓటర్లు ఎవరిని కోరుకున్నారో మంగళవారం సాయంత్రం తేలిపోతుంది.

దేశంలో అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గాల్లో రెండోదైన అరకు నుంచి కూటమి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కోడలు చెట్టి తనూజ, కాంగ్రెస్/వామపక్షాల అభ్యర్థిగా పి.అప్పలనర్స పోటీ చేశారు. ఇది ఐదు జిల్లాలలో కూడిన పార్లమెంటు నియోజకవర్గం కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో చెప్పలేని పరిస్థితి. వైసీపీ తమకే అవకాశం ఉందని భావిస్తోంది. ఇప్పటికే ఒకసారి ఎంపీగా గెలిచి ఉండడం, అనేక అభివృద్ధి పనులు చేసిన పేరు ఉండడంతో రెండోసారి ఎంపీగా గెలుస్తానని కొత్తపల్లి గీత ధీమా వ్యక్తంచేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా అసెంబ్లీ స్థానాల్లో..

అనకాపల్లిలో జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి ఎం.భరత్‌కుమార్ పోటీ చేయగా, పోరు హోరాహోరీగా సాగింది. అయితే ఎగ్జిట్ పోల్స్ కొణతాల రామకృష్ణకే అనుకూలమని వెల్లడించాయి. చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ నుంచి కరణం ధర్మశ్రీ మధ్య పోరు రసవత్తరంగా సాగింది. గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. మాడుగుల టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి, వైసీపీ నుంచి ఈర్లె అనురాధ పోటీ పడగా, విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎలమంచిలి జనసేన అభ్యర్థిగా ఎస్. విజయ్‌కుమార్, వైసీపీ నుంచి కన్నబాబురాజు పోటీ పడగా, ఇక్కడ కూడా ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిగా వంగలపూడి అనిత, వైసీపీ నుంచి కంబాల జోగులు పోటీ చేయగా, ఎగ్జిట్ పోల్స్‌లో టీడీపీకే అనుకూలమని తేలింది. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ నుంచి పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీ పడగా, ఇక్కడ ఫలితాలపై కూడా ఉత్కంఠ నెలకొంది.

అల్లూరి జిల్లాలో..

పాడేరు టీడీపీ అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి, వైసీపీ నుంచి విశ్వేశ్వరరాజు పోటీ చేయగా, ఇక్కడ కూడా పోరు హోరాహోరీగా సాగింది. అరకు బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావు, వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మధ్య రసవత్తర పోరు సాగింది. వీరిలో ఎవరికి వారే తమదే గెలుపని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ జిల్లాలో..

విశాఖ జిల్లాలో గాజువాక, భీమిలి, తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజక వర్గాల్లో బలమైన అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేయగా, వైసీపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పోటీగా నిలిపింది. ఈ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మిత్రులు పోటీ పడ్డారు. ఇద్దరూ మాజీ మంత్రులే. తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పోటీ చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది వేచి చూడాలి. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరఫున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీ చేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మంచి మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, వైసీపీ తరఫున కేకే రాజు పోటీ చేశారు.

ఈసారి టీడీపీ, జనసేనలు కూడా అండగా నిలవడంతో విజయం ఖాయమని విష్ణుకుమార్‌రాజు విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు తన గెలుపు ఖాయమని కేకే రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పశ్చిమంలో టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనందకుమార్ పోటీ చేశారు. ఇరు వర్గాలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి. పెందుర్తిలో జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ నుంచి అదీప్‌రాజ్ పోటీ చేశారు. గట్టి పోటీ ఉండడంతో ఇరువర్గాలు విజయం తమదంటే తమదేనని ధీమాగా ఉన్నారు.

నేడే ఓట్ల లెక్కింపు

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గదిలో ఒక రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఒక ఏఆర్‌వో, గెజిటెడ్ హోదా కలిగిన ఒక కౌంటింగ్ సూపరింటెండెంట్, ఒక సహాయకుడు, ఒక మైక్రో అబ్జర్వర్, ఈవీఎంలను అందజేసేందుకు ఇద్దరు వీఆర్‌వోలను నియమించారు.

ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు

ప్రతి నియోజకవర్గానికి ఒక గది కేటాయించి, 14 టేబుళ్లను ఏర్పాటు చేసి ఓట్లను లెక్కించనున్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక ప్రతి రౌండ్‌కు కనీసం అర్ధగంట సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చోడవరం నియోజకవర్గం పరిధిలో 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తి లెక్కింపు, 18వ రౌండ్‌లో 5 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓట్లు లెక్కించనున్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 235 పోలింగ్ కేంద్రాలు ఉంటే 14 టేబుళ్లపై 17 రౌండ్లు పూర్తిస్థాయిలో 18వ రౌండ్‌లో 11 బూత్‌లకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. అనకాపల్లి పరిధిలో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తిగా లెక్కింపు జరిపి 18వ రౌండ్‌లో 13 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఎలమంచిలి పరిధిలో 246 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలలో పూర్తిస్థాయిలో లెక్కింపు, 18వ రౌండ్‌లో 8 బూత్‌లకు సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు. పాయకరావుపేట పరిధిలోని 292 పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 పూర్తిస్థాయి రౌండ్లలో లెక్కించి, 21వ రౌండ్‌లో 12 బూత్‌ల ఓట్లు లెక్కించనున్నారు. అదే విధంగా నర్సీపట్నం పరిధిలో 262 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓట్లు 14 టేబుళ్లపై 18 పూర్తిస్థాయి రౌండ్లు లెక్కించి 19వ రౌండ్‌లో 10 పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. కాగా ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచే అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు, అధికారులు ఓట్ల లెక్కింపు సరళిని పర్యవేక్షించవచ్చు. ఆర్‌వోలు జారీ చేసిన పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు.

కేంద్రం వద్ద పటిష్ఠ భద్రతా చర్యలు

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ నేతృత్వంలో మూడంచెల భద్రతా చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఆర్‌పీఎఫ్ బలగాలు, ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద రిజర్వుడు పోలీసు బలగాలను, బయట ప్రధాన రహదారుల కూడలి వద్ద సివిల్ పోలీసులతో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనకాపల్లిలో నాయకుల హడావిడి

అనకాపల్లిలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు అనకాపల్లి చేరుకున్నారు. పట్టణంలో హోటళ్లు, లాడ్జీలు నాయకులతో నిండిపోయాయి. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, టీడీపీ, జనసేన, వైసీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు పట్టణంలో బస చేశారు.